# మాతృపూజ

"వీల్లేదు..." అంది కమలమ్మగారు ఖండితంగా

"ఎందుకు వీల్లేదు? నా తల్లికి పాద పూజచేసి నా కృతజ్ఞతలు చూపించుకోటానికి కూడా నాకు నీ అనుమతి కావాలా? ఎనభై అయిదేళ్ళ ముసలి వగ్గు నా తల్లి! బ్రతికి ఉన్న ఒక్క కొడుకు చేతినీళ్ళు తాగుతూ ఆఖరి దినాలు గడపాలని కోరిక ఉండడం ఏ తల్లికయినా సహజం. ఆ కోరిక నువ్వెలాగూ పడనివ్వటం లేదు. నీ బొందిలో ఊపిరి ఉండగా నా తల్లిని ఈ గడప తొక్కనివ్వవు! ఆ సంగతి నాకు బాగా తెలుసు! దాని ప్రాణం నా చెల్లెలు ఇంట్లో పోవలసిందే! కనీసం ఈ ఆఖరి దినాల్లో ఆమెకు పాద పూజ చేసే అదృష్టమయినా నాకు దక్కనివ్వవా?" అని సమాధానం చెప్పలేదు రామకృష్ణయ్యగారు.

అలా చెప్పలేరు ఆయన! కమలమ్మగారు ప్రతిపాదించిన ఏ విషయానికీ ఎదురు చెప్పకుండానే ఆ మహాపురుషుడి ముప్ఫయి రెండేళ్ళ వివాహ జీవితమూ గడిచిపోయింది. ఎదిరించేతత్త్వం అసలు ఆయన అలవాటే చేసుకోలేదు. ఈ ముప్ఫయి రెండేళ్ళ వివాహ జీవితంలో ముచ్చటగా ముగ్గురే పిల్లల్ని కన్నది కమలమ్మగారు పెద్దమ్మాయి వనజమ్మ ఆ ఊళ్ళోనే మరో వీధిలో ఉంటూంది. ఆమె భర్త తాలూకాఫీసులో గుమస్తాగా పనిచేస్తున్నాడు.

"వనజమ్మా! మీ పుట్టింటివారు ఈ ఊరే కదా –నువ్వెప్పుడూ వాళ్లింటికి వెళ్ళినట్లు కనబడవేం?" అని ఇరుగు పొరుగువాళ్ళు ఎవరయినా అడిగితే ఆ అమ్మాయి ఒక్కటే సమాధానం చెబుతుంది.

"ఏ ఆడపిల్లయినా తల్లిదండ్రుల ఇంటికి ఏం ఆశించి వెళ్తుంది? చిటికెడు పసుపూ, కుంకుమల కోసం! లేకపోతే ఒక జాకెట్టు గుడ్డముక్క కోసం! ఏమీ పెట్టకపోతే ఒక మంచిమాటకోసం! దేనికీ నోచుకోకపోతే ఎందుకు వెళ్ళటం? ఆస్తిపెట్టెల్లో భద్రపరచుకోటానికే తప్ప తినటానికి అక్కరకు వస్తుందని మా అమ్మకు తెలీదు! ఎడమచేత్తో ఎంగిలి మెతుకయినా విదపదు! 'మొన్న అమ్మాయి వచ్చి వెళ్ళినప్పుడు కేవలం పట్టుచీరకు అయిదు వందలయింది అంటూ పద్దులు రాసి ఒకపెట్టెలోంచి డబ్బుతీసి మరో పెట్టెలోనికి మారుస్తుంది! అంతే! మా నాన్నగారు ఆవిడ చెప్పిన మాటలకు తల ఆడించడం తప్ప ఎదురుచెప్పలేరు. ఇక ఆ ఇంట్లో అడుగు పెడితే ఆప్యాయంగా 'అమ్మాయ్! మంచినీళ్ళ కావాలా?' అని కూడా అడగదు! ఖర్మంచాలక ఒక పూట ఆ ఇంట్లో ఉంటే, స్టీలుగ్లాసు పోయిందనో, తప్పేలా పోయిందనో నానా రభసచేసి, అది నేనే దొంగిలించేనని నా మీద పెట్టి ఆ డబ్బులు వసూలు చేస్తుంది. నాకు అత్తవారిల్లే బాగుంది!"

రెండో అమ్మాయి పెళ్ళి చేసుకుని మొగుడితో సిమ్లాలో ఉంటోంది. ఎప్పుడో రెండేళ్ళ కో పర్యాయం రావటం,నాలుగు దినాలు ఉండి కమలమ్మగారి పీనాసితనానికి,

నోటికీ భయపడి మధ్యలోనే వెళ్ళిపోవటం జరుగుతూ ఉంటుంది.

ఇక మిగిలింది మూడో కొడుకు రామం! వాడు బి.కామ్. ప్యాసయి బేంకులో క్లర్కుగా ఉద్యోగం సంపాదించేడు. అతడి పెళ్ళి కూడా నిశ్చయమయిపోయింది. ఇంకో ఎనిమిది దినాల్లో పెళ్ళి! ఆ పెళ్ళికి ఎలాగయినా తన తల్లిని తీసుకువచ్చి, ఆమెకు మాతృపూజ చెయ్యాలని రామకృష్ణయ్యగారి సంకల్పం. ఆ విషయం గురించి చాలా దినాలు ఆలోచించి, ఆఖరున తన అభిప్రాయం కమలమ్మ దగ్గర వ్యక్తం చేశారు.

ఆ సంకల్పానికే "... వీల్లేదు..." అంటూ ఖండితంగా సమాధానం చెప్పింది ఆవిడ. "అదికాదు కమలం... నేను చెప్పేది పూర్తిగా విను..." అంటూ సర్దిచెప్పబోయాడు.

వంటింట్లోకి వెళ్ళబోతున్న కమలమ్మ క్షణంసేపు తీక్షణంగా భర్తవంక చూసి వెనక్కు వచ్చి కవాచీ బల్లమీద కూలబడిపోయారు. తరువాత "మీరేం చెప్పొద్దు.... నేనే చెప్తాను..." అంటూ గొంతు సవరించుకునేటందుకు ఆగేరు.

వాలు కుర్చీలో కూలబడిన రామకృష్ణయ్యగారు చేతిలోని పేపరుకింద పడేసి వెనక్కువాలేరు. ఇక ఆవిడ చెప్పే ఉపన్యాసం వినేటందుకు సిద్ధమయిపోవాలని ఆయనకు తెలుసు. ఆవిడ చెప్పటం, తను వింటూ తల ఊపటం! కొంతసేపు గంగిరెద్దు వేషం వేయాలి!! తప్పదు! రవంత తేడా వచ్చిందంటే ఇల్లుపీకి పందిరి వేయటం ఖాయం! తాను పట్టిన కుందేటికి ఆరుకాళ్ళు వున్నాయని ఆవిడంటే, మరో కాలు ఎక్కువే చెప్పాలికానీ తక్కువ చెప్పటానికి వీలులేదు.

కమలమ్మగారు ఆరంభించేరు "రామానికి వచ్చే కట్నమెంత? ఆమాంబాపతు పన్నెండువేలు! అందులోనే ఆడపడుచుల లాంఛనాలు సర్దాలి! చీరలు పెట్టాలి! ఇంక మన అల్లుళ్ళ సంగతి మీకూ తెలుసుకదా! మింగ మెతుకు లేకపోయినా మీసాలకు సంపెంగనూనె రాస్తారు. టెర్లిన్ బట్టలే తప్పకట్టుకోరు! రామానికి పెళ్ళిపేరుతో ఆరు జతల బట్టలు కుట్టించాలా? అవన్నీ పోను పెళ్ళి ఖర్చులు! ఆ పన్నెండు వేలలో ఇవన్నీ సర్దుకు రావటమంటే మాటలా? కట్నం సొమ్ము నేనేదో మిగిల్చేసుకుంటానని మీ బాధ"

ఆయాసం తీర్చుకోటానికి మాటలు ఆపేరు!

అవన్నీ అందమైన అబద్ధాలే! కట్నం వసూలు చేయటం మాట నిజమే అయినా, ఆడపిల్లలకి లాంఛనాలు ఇస్తుందన్నా, అల్లుళ్ళకి టెర్లిన్ సూట్లు కుట్టిస్తుందన్నా, రామంగాడి ముఖాన్న ఆరుజతల పంచెలు కొనిపెడుతుందన్నా ఆయన నమ్మలేరు! నమ్మకపోయినా ఆవిడ పెదాల మీద బూరెలు వండుతూ వుంటే ఆ వంటకపు వాసన ఆస్వాదించి ఆనందించటం తప్ప వేరుగా ఏమీ చేయలేరు రామకృష్ణయ్యగారు!.

కమలమ్మగారు మళ్ళీ ఆరంభించేరు!

"నేనేదో మిగిల్చేసుకుంటాననే కదూ మీ అమ్మను తీసుకొచ్చి ఆవిడకు పాదపూజ చేస్తానంటున్నారు? అయినా 'రామా! కృష్ణా!' అంటూ విశ్రాంతి తీసుకోక ఈ పిదపకాలంలో ఈ సంబరాలన్నీ ఎందుకట ఆవిడగారికి? మీతో చాటుగా చెప్పుకుని ఏడ్చింది కాబోలు, తనకు పాదపూజ చెయ్యమని? ఈ పూజపేరుతో పురోహితుడు నాలుగు నిమిషాలు నోరాడించి నలభై రూపాయలు పట్టుకుపోతాడు. పైగా నాలుగైదు రూపాయలు పెడితేగాని పూజకు పువ్వులు రావాయె! ఇంతా చేసేక ఏదో ఆవిడకు పెట్టకపోతే బాగుండదు కదా! ఇవన్నీ ఖర్చులు కావూ? ఇలాగయితే సంసారం బాగుపడినట్లే!"

ఆఖరున ఉస్సూరంటూ నిట్టూర్చి మాట్లాడ్డం ఆపింది ఆమె.

రామకృష్ణయ్యగారికి కొంతసేపు ఏం సమాధానం చెప్పాలో తోచలేదు. తరువాత మెల్లగా అన్నారు. "అది కాదు కమలం, నిదానంగా ఆలోచించు. మనం ఏనాడూ మా అమ్మను ఇంటికి తీసుకువచ్చి ఇంత అన్నం పెట్టిన పుణ్యాన పోలేదు. నా చెల్లెలే ఆవిడ జాగ్రత్తలన్నీ చూసుకుంటోంది. మా బావ మంచివాడు కనుకే నా తల్లిని కడుపులో పెట్టుకుని కాపాడుతున్నాడు. ఆవిడ ఎంతోకాలం ఎలాగూ బ్రతకదు. ఈ సమయంలో ఆవిణ్ణి కాస్త కనిపెట్టి చూడకపోతే లోకం మనిద్దరినీ, ఆడిపోసుకుంటుంది. అందుకనే నీకు చెబుతున్నాను, అబ్బాయి పెళ్ళి సందర్భంలో ఈ 'మాతృపూజ' వ్యవహారం చేస్తే వచ్చిన చుట్టాలు నలుగురూ మా అమ్మచేతిలో పదో పరకో పెట్టకపోరు. అవన్నీ ఆవిడకు కాస్త ఆసరాగా మిగుల్తాయి! మనం ఆవిడ వంక కొంతకాలం చూడకపోయినా ఎవ్వరూ పట్టించుకోరు! మనం ఆవిడ ఎడల లోగడ చూపిన నిర్లక్ష్యమంతా ఈ పూజతో కొట్టుకుపోతుంది. నీకు మంచిపేరు వస్తుంది!"

కమలమ్మగారు కొంతసేపు మాట్లాడలేదు! తన మాటలు ఆమెపై పనిచేస్తున్నందుకు లోలోపలే సంతోషించేరు రామకృష్ణయ్యగారు. మూడు నిమిషాలు ఆలోచనలో మునిగిపోయిన ఆవిడ ముఖంలో ఒక కాంతిరేఖ తళుక్కున మెరవటం ఆయన స్పష్టంగా గమనించేరు. "సరే! మీ ఆలోచన ప్రకారమే చేద్దాం! కానీ, ఖర్చుమొత్తం వందరూపాయలు దాటిందంటే మాత్రం ఒప్పుకోను" అంది కమలమ్మగారు శాంతంగా.

రామకృష్ణయ్యగారి ఆనందానికి అవధుల్లేవు! భార్య తన ప్రతిపాదనను ఇంత సులువుగా అంగీకరించటం ఇదే మొదటిసారి. ఆనందంతో ఆయన కళ్ళు చెమర్చేయి!!

★ ★ ★

జగడాలతోటీ, జట్టీలతోటీ రామం పెళ్ళిఅయింది! కమలమ్మగారు పెళ్ళిపందిరి అంతటా తాను అయి స్వైర విహారం చేసింది. ఇంటికి రాబోయే కోడలు పిల్ల పెళ్ళిలో కమలమ్మగారి అరుపులు చూసి జడుసుకుని జ్వరం తెచ్చుకుంది. మరునాటి రాత్రి

కార్యం గదిలో అడుగుపెట్టినప్పుడు ఆ పిల్ల రామంతో ఖచ్చితంగా చెప్పేసింది.

'మీ అమ్మగారి నోరు చూస్తుంటే నాకు మతిపోతోంది. ఈవిడ నన్నేం బ్రతకనిచ్చేలా లేదు. ఈవిడ నోరు మంచిది కాదని విన్నాను కాని, ఇంత ఘోరంగా మాత్రం ఉంటుందనుకోలేదు. ఇంతకంటె పదిమంది మొగాళ్ళేనయం. అయినా ఆవిడలా నోరుపారేసుకుంటూ ఉంటే మీ నాన్నగారు బెల్లంకొట్టిన రాయిలా చూస్తూ ఉండిపోతారే తప్ప మాట్లాడరేం? మీరు ఆఫీసుకు వెళ్ళిపోతే నేనుఆవిడతో ఎలా వేగను? నేను కడుపునిండా తినటానికి, శుభ్రంగా బట్టకట్టుకోవటానికి అలవాటుపడ్డాను. అందుకని మీరు వేరింటి కాపురం వెంటనే పెట్టేస్తానంటే నేను మీతో వస్తాను. లేదా అంతవరకూ ఇక్కడే ఉంచండి నన్ను".

ఆ అమ్మాయి మరి మాట్లాడకుండా ఉండేందుకు ప్రేమతో ఆమె పెదాలను తనపెదాలతో మూసేశాడు రామం. ఒక అరగంట తర్వాత అన్నాడు. "నువ్వొక నెల ఓపికపట్టు, నేనుట్రాన్స్ఫర్‌కు ఎలాగూ అప్లయిచేశాను"

* * *

ఆ మరుసటి ఉదయమే రామకృష్ణయ్యగారు తల్లికి మాతృపూజ చేశారు. కమలమ్మగారు కూడా భర్తతోపాటు పీటలమీద కూర్చుంది! కాని పూజ సమయంలో ఆవిడ విసిరిన ఒక్క పువ్వయినా అత్తగారి పాదాలమీద పడలేదని చుట్టూచేరిన అమ్మలక్కలందరూ వూసులాడుకున్నారు. పూజలయ్యాక రామకృష్ణయ్యగారు తల్లికి కొత్త బట్టలు సమర్పించేరు. తరువాత కమలమ్మగారు పెళ్లి పందిరంతా కలయతిరిగి " మా అత్తగారి పాదాలకు అందరూ మొక్కండి. ఆవిడ పాదాలకు నమస్కరిస్తే సాక్షాత్తు ఆదిశక్తికి నమస్కరించినట్లే! మన వంశంలో ఈవిడే పెద్ద వయస్సావిడ! తోచిన కట్నం, కానుకా సమర్పిస్తే మీకూ పుణ్యం కలుగుతుంది" అంటూ పెద్దగొంతుతో 'కేన్వాస్' చేసింది.

భార్యలోని మార్పుకు రామకృష్ణయ్యగారు ఎంతో సంతోషించేరు. పెళ్ళికొచ్చిన బంధువులందరూ పెద్దావిడ కాళ్ళకు మొక్కి ఆవిడ ఆశీస్సులందుకొని తోచిన కట్నకానుకలు ఆమె పాదాల దగ్గర ఉంచేరు.

పాదపూజ తతంగం పూర్తి అయ్యేక కమలమ్మగారే రెండు చేతుల్తోటి ముసలావిణ్ణి గదిలోకి తీసుకువెళ్ళి మంచంమీద కూర్చోపెట్టేరు. తరువాత దిష్టితీసి పారేశారు. ఆ సాయంకాలం ముసలావిడ తన చెల్లెలుతో కలిసి రిక్షా ఎక్కి బస్సుస్టాండుకు వెళ్ళిపోతూ ఉంటే రామకృష్ణయ్యగారి కళ్ళు చెమర్చేయి. ఈ ఒక్క కార్యక్రమమయినా సవ్యంగా జరిగినందుకూ, తన తల్లికి ఏదో రూపంలో కాస్త ముట్టినందుకూ ఆయనకు ఎంతో సంతోషమయింది. ఈ మాత్రానికి ఒప్పుకున్నందుకు ఆయన కమలమ్మకు మనసులోనే

కృతజ్ఞతలర్పించేరు.

సుమారు ఇరవై దినాలు గడిచిపోయేయి. చెల్లెలు వూళ్ళో ఉంటున్న తన తల్లి దగ్గరనుండి ఒక ఉత్తరం వచ్చింది రామకృష్ణయ్యగారికి. అది చదివి అచేతను డయిపోయారు ఆయన. స్థూలంగా దాని సారాంశం ఇది.

'నాయనా రామకృష్ణుడూ! నీకు నా ఆశీస్సులు. నేను ఆరోగ్యంగా ఉన్నాను. నీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో. నా కీ మధ్య గుడ్డముక్కలన్నీ చిరిగిపోయేయి. అమ్మాయినీ, అల్లుణ్ణీ ఇప్పుడు బట్టలు కొనమని అడిగితే ఏం బాగుంటుంది? ఈ మధ్య పాదపూజలో కానుకల రూపంలో వచ్చిన ఎనిమిది పంచెలూ ఏమయ్యాయని అమ్మాయి అడిగితే ఏం సమాధానం చెప్పను? కట్నం రూపంలో వచ్చిన మూడువందలు కూడా అంతే. నేను నోరు విప్పితే పితూరీ చేసినట్లవుతుంది నా పాదపూజ చేయించుకోటానికి బస్సులో వచ్చి వెళ్ళినందుకు ఒళ్ళునొప్పులు తప్పఇంకేం మిగిలేయిరా నాయనా, నాకు? అయినా నాకీ పూజలన్నీ ఎందుకు? ఒక్కగానొక్క కొడుకువి, నీ చేతితో పెడితే పిడికెడు అన్నం తినాలని నా కుండదా? నీకు పదమూడేళ్ళు వచ్చే వరకూ గోరుముద్దలు చేసి తినిపించేనురా, బాబూ. నీ చేత్తో ఆఖరుకు తులసితీర్థం పొయ్యి చాలు! అమాత్రానికయినా నువ్వు కమలమ్మని ఒప్పించగలిగితే అంతేచాలు! నోరు తెరిచి అడుగుతున్నాను, ఒక వంద రూపాయలు పంపితే రెండు తెల్లపంచెలు కొనుక్కుంటాను. – మీ అమ్మ!'

ఉత్తరం మడిచి కవరులో ఉంచి మెల్లగా వంటింటి గుమ్మం వద్దకు వెళ్ళేరు రామకృష్ణయ్యగారు. కమలమ్మ కూరపోపు పెడుతోంది! "చూడు కమలం!.... మొన్న మా అమ్మకు పాదపూజ చేసినప్పుడు అందిన కట్నాలూ, కానుకలూ ..." అంటూ ఏదో మాట్లాడబోయేరు ఆయన.

కమలమ్మగారు పోపుకూర ముఖాన కొట్టి రామకృష్ణయ్యగారి వంకా, ఆయన చేతిలోని కవరువంకా చూపులు మార్చి మార్చి చూసింది. తరువాత ఆయన్ని మాట్లాడ నివ్వకుండా "అవును! ఆ పంచెలన్నీ నేను అమ్మేశాను. కట్నం కూడా తీసేసుకున్నాను. ఇంత చిన్న విషయానికే ఆవిడగారు అప్పుడే మీకు ఉత్తరం రాసెయ్యాలా? వంద రూపాయలు పెట్టుబడి పెట్టి ఆవిడకి పాదపూజ చెయ్యటానికి ఎందుకు ఒప్పుకున్నా ననుకున్నారు? అయినా ఇంతపిదపకాలంలో డబ్బు మీద అంతయావ ఉండకూడదు! ఆ బట్టలూ, సొమ్మూ నెత్తిన పెట్టుకుని తిరుగుతుందా ఏమిటి?" అంటూ కస్సుమంది.

రామకృష్ణయ్యగారు మరి మాట్లాడకుండా వీథిలోకి వెళ్ళిపోయారు. ★

(ఆంధ్రప్రభ వీక్లీ, జులై 1979)